క్లుప్తంగా

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

కొండపి(సింగరాయకొండ): భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయం గురించి మంగళవారం మండలంలోని చోడవరం, ముప్పవారం గ్రామాల్లోని ప్రచారం చేసినట్లు ప్రబోధ సేవా సమితి కంభం కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. భగవద్గీతలోలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయంలోని జీవాత్మ, పరమాత్మ గురించి ప్రజలకు తెలియజేశారు. దీని ఆధారంగానే త్రైత సిద్ధాంత భగవద్గీతను ఆచార్య ప్రబోధానంద యోగేశ్వరస్వామి రచించారన్నారు. కార్యక్రమంలో చేగిరెడ్డి రామకృష్ణారెడ్డి, కాకర్ల శ్రీనివాసరెడ్డి, మస్తాన్, తిరుపతి స్వామి, కోటయ్య, లక్ష్మి, శ్రీదేవి, సరస్వతి, నారాయణ పాల్గొన్నారు.

సమావేశాలను జయప్రదం చేయండి



నూతనంగా ఎన్నికైన ఆటోవర్కర్స్ యూనియన్ కమిటీ

కందుకూరు: నెల్లూరులో ఆగస్టు 5, 6వ తేదీల్లో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని, ఈ సమావేశాలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్ఏ గౌస్ అన్నారు. ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు సమావేశాలకు హాజరౌతారని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా సీహెచ్ మల్లికార్జునరావు, ఉపాధ్యక్షులుగా ఎం నరశింహ, ఏ మాధవలు, కార్యదర్శిగా ఉప్పు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా ఎస్ చెంచురామయ్య, డి.దినేష్, కోశాధికారిగా జి.ఏసు, కమిటీ సభ్యులుగా పి.వెంకటేశ్వర్లు, ఆర్ మాల్యాద్రి, డి.నారాయణ, రవిలను ఎన్నుకున్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.359



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం సరాసరి ధర రూ.359 పలికింది. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం క్లస్టరు గ్రామాల రైతులు 992 బేళ్ల వేలానికి తీసుకురాగా వాటిలో 929 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 63 బేళ్ల తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.305.95 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు అత్యధిక ధర రూ 360

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం అత్యధిక ధర కేజీ రూ.360 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని చోడవరం, చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాల రైతులు 1181 బేళ్ల వేలానికి ఉంచగా వాటిలో 1107 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 74 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.307.35 పలికింది. వేలంలో 28 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రామచంద్రరావు

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సీహెచ్.రామచంద్రరావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా ఉన్న జి.కృష్ణయ్య గత నెల 30వ తేదీన ఉద్యోగ విరమణపొందారు. కాగా వెలిగండ్ల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రామచంద్రరావును సీఎస్‌పురం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా జిల్లా అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టరుతో సెబ్ ఎస్సై దయాకర్

సింగరాయకొండ: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును సీజ్ చేసి కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం మండలంలోని కలికవాయ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాలేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న సింగరాయకొండకు చెందిన తన్నీరు రాఘవను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జరిమానా చెల్లించేందుకు నిరాకరించడంతో ట్రాక్టరును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్ పేర్కొన్నారు.

బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తే ఉపేక్షించం



హైవే భూముల వివరాలు తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ



జేసీకి సమస్యలు వివరిస్తున్న కోవిలంపాడు నాయకులు, గ్రామస్తులు

- అధికారులకు జేసీ గోపాలకృష్ణ హెచ్చరిక
- 167బి, బీకేవీ ఎక్స్‌ప్రెస్ హైవే భూముల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు): బాధ్యతా రాహిత్యంగా పనిచేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జేసీ గోపాలకృష్ణ ఆర్డీఓ, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందితో మైదకూరు–సింగరాయకొండ 167బీ జాతీయ రహదారి, బీకేవీ(బెంగళూరు, కడప, విజయవాడ) గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే భూసేకరణ స్థితిగతులు, పరిహారం చెల్లింపుల పెండింగ్‌పై సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశానికి కనిగిరి డీఐ హాజరుకాకపోవడంతో జేసీ అసహనం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లింపులో రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు సరిగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిలో భూములు కోల్పోయిన రైతులు తమకు పరిహారం రాలేదని, ఈ విషయమై జిల్లా కార్యాలయంకు, స్పందనకు వచ్చి పలుమార్లు వినతిపత్రాలు ఇస్తున్నారని దీనిపై ఎన్నిసార్లు చెప్పినా మీలో మార్పు రావడం లేదని, సమస్యలు పరిష్కరించకుండా ఏం చేస్తున్నారని వీఆర్‌ఓలను, రెవెన్యూ సిబ్బందిపై మండిపడ్డారు. భూసమస్యల పరిష్కారంపై వచ్చిన రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు వీఆర్‌ఓలపై ఫిర్యాదులు వస్తున్నాయని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కనిగిరి ఆర్డీవో సమీక్షలకు గైర్హాజరైన కొందరు వీఆర్‌ఓలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మునునూరు వీఆర్వో తీరు సరిగా లేదని, ఆయనను కనిగిరికి పంపాలని ఆర్డీఓను ఆదేశించారు. జాతీయ రహదారి క్లెయిమ్స్‌కు సంబంధించి నివేదికలు త్వరిగగతిన పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కాగా కోవిలంపాడులో ఇళ్లు కోల్పోయిన పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరగా వారికి న్యాయం చేయాలని తహసీల్దార్, ఆర్డీవోను ఆదేశించారు. కార్యక్రమంలో కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, డీటీ ఎం.సలోమి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

కందుకూరు: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకాం వంటి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చునని, అనంతరం 11 నుంచి 15వ తేదీ వరకు కోర్సుల ఆప్షన్‌లు ఎంపిక చేసుకోవాలన్నారు. అనంతరం ధ్రువపత్రాలు పరిశీలించి 19వ తేదీ సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తు రుసుంను ఓసీ అభ్యర్థులకు రూ.400, బీసీలకు రూ.300, ఎస్సీ, ఎస్టీలకు రూ. 200 నిర్ణయిస్తూ ఏపీ ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం కాలేజీలో ఆన్‌లైన్ అడ్మిషన్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. కందుకూరు పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియెట్ మార్క్స్ లిస్టు, టీసీ, 10వ తరగతి సర్టిఫికెట్, క్యాస్టు, ఇన్‌కమ్ సర్టిఫికెట్స్, విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, రెండు పాస్‌ఫొటోలు తీసుకోవాలని సూచించారు. అడ్మిషన్ల సమాచారం కోసం 8686368689, 9490300526, 9440221228 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ

హనుమంతునిపాడు: మండల పరిధి దాసళ్లపల్లిలో గూడూరి కొండయ్యకు తన పిత్రార్జితం వచ్చిన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు తహసీల్దార్ కిషోర్‌రెడ్డి మంగళవారం గ్రామంలోని భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొండయ్య భూమిని స్థానిక దళారులు విజయవాడకు చెందిన వారికి అక్రమంగా అమ్మి రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఫిర్యాదు రావడంతో విచారిస్తున్నామన్నారు. నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. వీఆర్‌ఓ పురుషోత్తం, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ఐదేళ్ల లోపు చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పాతూరులోని మూడు అంగన్ వాడీ కేంద్రాలను మంగళవారం చైర్మన్ అబ్దుల్ గఫార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పౌష్టికాహార పథకాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించి, చైతన్యవంతులు చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాలకు వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. స్థానిక నాయకులు దాసరి మురళీ, ఉపాధ్యాయులు రజనీ, మల్లేశ్వరి, వెంకట రత్నం, ఆయాలు వనజ, సిలార్ బీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి



సభ్య నమోదులో బీటీఏ నాయకులు

కందుకూరు: జీఓ నంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాల వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.మోహన్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని పలుకూరు, మహదేవపురం, కందుకూరు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదు చేపట్టారు. పాఠశాల యాప్స్ బోధనకు ఇబ్బందికరంగా ఉన్నందున యాప్స్‌ను రద్దు చేయాలని, పీఆర్‌సీడీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, నూతన పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు, అసోసియేట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, మండల అధ్యక్షుడు ఎం రమణయ్య, ప్రధానకార్యదర్శి నాగులపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



సీఎస్‌పురం ఎస్టీ కాలనీలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని హెచ్‌ఎం తోట శ్రీనివాసులు, బీజేపీ మండల అధ్యక్షుడు ఇండ్ల వెంకటసత్యం అన్నారు. సీఎస్‌పురం ఎస్టీకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అమ్మకోసం ఒకచెట్టు కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం ద్వారా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే ఏటా ఒక మొక్కైనా నాటి దాన్ని సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలో విధిగా మొక్కలు నాటి పెంచాలని సూచించారు. బొబ్బూరి రమేష్, పాలకొల్లు వెంకటరెడ్డి, ఏసు, రేనాటి వెంకటేశ్వర్లు, దాసరి మల్లికార్జున పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్

కనిగిరి రూరల్: ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి, యువత వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 4న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక దర్శి చెంచయ్య భవన్‌లో మంగళవారం విద్యార్థి, యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ నీట్ పరీక్షల అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంలో అసమర్థ పాలన జరుగుతుందని ఘాటుగా విమర్శించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా సుబ్బారావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అన్ని ప్రభుత్వ సంస్థల్లో ఉన్న ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు తక్షణ ఉపాధి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్, వైఎఫ్ నాయకులు సయ్యద్ ఇర్ఫాజ్, జి.సురేష్, తాహీద్, బాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కందుకూరు: ప్రభుత్వ పథకాలు, దాతలు అందించే సహకారంతో పేద విద్యార్థులు విద్యలో రాణించేందుకు కృషి చేయాలని పట్టణంలోని జనార్దనకాలనీ ఎంపీపీఎస్ పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం జి.రామకృష్ణమ్మ సూచించారు. మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన తోకల వెంకటేశ్వర్లు రూ.10వేల విలువ చేసే నోట్‌బుక్స్, ప్యాడ్స్, పెన్నులు, ఇతర విద్యాసామగ్రిని మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం అనేది చదువుకు అడ్డంకి కాదని, విద్యార్థులకు పాఠశాలకు గైర్హాజరు కాకుండా ప్రతిరోజు పాఠశాలకు రావాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ ప్రతిభ, పి. శాంతకుమారి, పద్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన కల్పించాలి



ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని 14 హెల్త్ క్లీనిక్ సెంటర్ల పరిధిలో అతిసార, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య అన్నారు. స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌లో మంగళవారం ఆశావర్కర్ల డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌లో వచ్చే వ్యాధులపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరంఉందన్నారు. అతిసార సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. చిన్న పిల్లలకు నీళ్ల విరోచనాలైతే వెంటనే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తాపించాలని సూచించారు. డయేరియా ప్రాణంతకమని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశావర్కర్లు ఏఎన్‌ఎంలకు అందుబాటులో ఉంటూ గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మెళకువలతో విద్యాబోధన చేయాలి

- డిప్యూటీ డీఈఓ చంద్ర మౌళీశ్వరరావు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్ర మౌళీశ్వరరావు

కనిగిరి రూరల్: బోధన అభ్యసన ప్రక్రియ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన, మెళకువలతో కూడిన విద్యా బోధన చేయాలని డిప్యూటీ డీఈఓ చంద్ర మౌళీశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కనిగిరి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, సీఎస్‌పురం, పామూరు, పీసీపల్లి, పొన్నలూరు, మర్రిపూడి, పొదిలి మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు జరుగుతున్న టీచ్ టూల్ ట్రైనింగ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ పది రోజుల పాటు జరిగే శిక్షణలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు డైరెక్టర్ జి. సంజీవి, ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు యువీ నారాయణరెడ్డి, డీవీ సుబ్బారావు, రాజాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు అరికట్టడంలో ఆశాలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న డీఐఎంహెచ్‌ఓ మాధవీలత

సింగరాయకొండ: సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ఆశా కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషించాలని ఒంగోలు డివిజన్ డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాధవీలత పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్టాప్ డయేరియా కార్యక్రమంపై ఆశాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులు ఎవరూ డయేరియాతో చనిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జులై నెల మొత్తాన్ని డెంగీ మాసోత్సవంగా తీసుకుని దోమలు కుట్టకుండా, పుట్టకుండా ఆశా కార్యకర్తలు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మెడికల్ అధికారి, లెప్రసీ ప్రత్యేకాధికారి డాక్టర్ బి.శ్రీవాణి మాట్లాడుతూ జులై 18వ తేదీ నుంచి కుష్టువ్యాధి నిర్ధారణ క్యాంపు నిర్వహించాలని సూచించారు. డాక్టర్ చైతన్యకృష్ణ, డాక్టర్ ధీరేందర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలతో ప్రజలకు మేలు



మాట్లాడుతున్న డీఎస్పీ కిషోర్‌బాబు

సింగరాయకొండ: కేంద్ర ప్రభుత్వం జులై 1వ తేదీ నుంచి నూతనంగా ప్రవేశపెట్టిన కొత్త చట్టాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక దేవి సీ పుడ్స్ కంపెనీలో మంగళవారం నూతన చట్టాలపై కంపెనీ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటి వరకు 1947 నాటి చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. పాత చట్టాలైన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ చట్టాల బదులు బీఎన్‌ఎస్, బీఎన్‌ఎస్‌ఎస్, బీఏఎస్ చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. ఈ చట్టాల వల్ల బాధితుడు దేశంలో ఎక్కడైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కోర్టులు విధించే జరిమానాలు కూడా భారీగా పెరిగాయన్నారు. గతంలో చిల్లర వ్యాపారులపై నమోదు చేసే పెట్టీ కేసులపై అత్యధికంగా 250 రూపాయల వరకు కోర్టులు జరిమానా విధించేవని ఇప్పుడు ఆ మొత్తం వెయ్యి రూపాయలు జరిమానా వివరించారు. ఎస్సై టి.శ్రీరామ్, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు